క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. జబర్దస్త్ కమిడియన్ చిట్టిబాబు, కుటుంబ సభ్యులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రేపు వలంటీర్లకు వందనం

చాపాడు : స్థానిక పోలీసుస్టేషన్ సమీపంలోని వైఎస్ కళ్యాణ మండపంలో సోమవారం గ్రామ వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి మహబూబ్ బీ తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. గ్రామ వాలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో సత్కరించనున్నామని ఎంపీడీఓ చెప్పారు.

20న వలంటీర్లకు సన్మానం

ప్రొద్దుటూరు : స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో 20వ తేదీ సాయంత్రం 4 గంటలకు వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.రామాంజనేయరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి హాజరై ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు సేవ వజ్ర, సేవ రత్న, సేవ మిత్ర అవార్డులు అందించి సన్మానించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

రాయలసీమ రాష్ట్ర సమితిని ఆదరించండి

ప్రొద్దుటూరు క్రైం : రానున్న ఎన్నికల్లో రాయలసీమ రాష్ట్ర సమితి అభ్యర్థులను ఆదరించాలని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. శనివారం ఆయన పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను ఆవిష్కరించారు. త్వరలో ఇంటింటి ప్రచారం ప్రారంభిస్తామన్నారు.


డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు, సంఘ సభ్యులు

ప్రొద్దుటూరు క్రైం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 2024 డైరీని శనివారం జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు తాలుకా ప్రెసిడెంట్ ఎంపీ ప్రభాకర్‌రావు, కార్యదర్శి రామచంద్ర, డాక్టర్ నరసింహ, కార్యవర్గ సభ్యులు శ్రీధర్, అపర్ణ, శోభారాణి, రోజా, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

మూలె రామమునిరెడ్డికి సన్మానం



డాక్టర్ మూలె రామమునిరెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రొద్దుటూరు : నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం బోడెమ్మనూరు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం అష్టావధానం కార్యక్రమం నిర్వహించారు. బర్న్స్ సంస్థ వారి సారథ్యంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ అధ్యక్షతన తిరుపతికి చెందిన ఉప్పలదడియం భరత శర్మ అవధానం చేయగా, దీవి హయగ్రీవాచారి సంచాలకులుగా వ్యవహరించారు. కానాల మాధవరావు పర్యవేక్షణలో సాగిన ఈ కార్యక్రమం శ్రోతలను అలరించింది. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన డాక్టర్ మూలె రామమునిరెడ్డి నిద్రాక్షరి, న్యస్తాక్షరి అంశాలను నిర్వహించారు. కార్యక్రమం అనంతరం డాక్టర్ మూలె రామమునిరెడ్డిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం



బద్వేలు అర్బన్ : సేవారత్న పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే డాక్టర్ సుధ



అట్లూరు : వలంటీర్లకు సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టరు సుధ

ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 23 సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు ప్రభుత్వం అందిస్తున్న సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, నేడు ఆ పరిస్థితి లేకుండా అర్హత ఉన్న లబ్ధిదారుల వద్దకే వలంటీర్లు వెళ్లి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందించడంలో వలంటీర్ల పాత్ర చాలా కీలకమని అన్నారు. అనంతరం సేవారత్న కింద ఐదు గురికి, సేవామిత్ర కింద 351 మంది వలంటీర్లకు పురస్కారాలు అందజేసి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్‌లు గోపాలస్వామి, ఆర్.వి.సాయిక్రిష్ణ, నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, సివిల్‌సప్‌లెస్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, కేశవరెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు దుద్దుకూరు సత్యం, చెన్నయ్య, శివయ్య, బిజ్జం రమణ, అనిల్, వెంకటక్రిష్ణ, చెన్నకృష్ణారెడ్డి, రజనీకాంత్, మౌలాలి, వెంకటసుబ్బయ్య, కో ఆప్షన్ మెంబర్ రామచంద్రారెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎస్.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఎం.క్రిష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు మరువలేనివి

అట్లూరు : గ్రామ వలంటీర్ల సేవలు మరువలేనివని బద్వేలు ఎమ్మెల్యే డాక్టరు సుధ పేర్కొన్నారు. మండల కేంద్రమైన స్త్రీశక్తి భవనంలో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశంలో ఏరాష్ట్రంలో చేపట్టని విధంగా సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నెలకొల్పారన్నారు. అలాగే గ్రామాలలో ప్రతి 50 కుటుంబాలకు ఒక గ్రామ వలంటీరును ఏర్పాటు చేసి ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాలు నేరుగా అందజేయడం గొప్ప విషయమన్నారు. అందుకే వలంటీర్ల పనితీరుకు మన ముఖ్యమంత్రి వందనం కార్యక్రమం కింద వారికి సేవారత్న, సేవామిత్ర అవార్డులతో పత్రాలు అందజేసి వారికి సన్మానం చేసే కార్యక్రమం చేపట్టారన్నారు. అట్లూరు మండల పరిధిలో 113 మంది వలంటీర్లు ఉండగా అందులో ఐదు మందికి సేవా రత్న కింద ఒక్కొక్కరికి రూ. 30 వేలు, మిగిలిన వారందరికి సేవా మిత్ర కింద రూ. 15 వేలు చొప్పున అంద జేయడం జరిగిందన్నారు. అనంతరం వారిని సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండా మాధవరెడ్డి, మండల కన్వీనరు ముడమాల ప్రభాకర్‌రెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టరు రొండా మల్లికార్జునరెడ్డి, అందూరు రామకృష్ణారెడ్డి, సచివాలయాల మండల కన్వీనరు మణ్యం మల్లికార్జునరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మణ్యం వెంకటరెడ్డి, కుంభగిరి ఎంపీటీసీ సభ్యుడు గంగయ్య, కమలకూరు సర్పంచ్ చిట్టిబోయిన పెద్దసుబ్బయ్య, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పొన్నఓలు బ్రహ్మానందరెడ్డి, సుబ్బరాయుడు, పెంచల్ రెడ్డి, డీలర్ కృష్ణారెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పదవీ వ్యామోహంతోనే వరద విమర్శలు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : కేవలం పదవీ వ్యామోహంతోనే మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక రెండో వార్డు కౌన్సిలర్ ద్వార్శల భారతి స్వగృహంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన స్వార్థ రాజకీయాల కోసం వరదరాజులరెడ్డి ఎంతో మందిని నాశనం చేశారని ఘాటుగా విమర్శించారు. భూమి కోసం బ్రాహ్మణుడిని పెట్రోలు పోసి సజీవ దహనం చేయడం, దానికి సంబంధించి హైదరాబాద్‌లో కేసు నమోదు అయిందన్నారు. ఈ కేసులో వరద తనయుడు కొండారెడ్డి పేరు నమోదు చేయగా అధికార పార్టీ బలంతో కేసు నుంచి తప్పించారన్నారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య కుమారుడు వీరప్రతాప్, మరికొంత మందిని కేసులో పెట్టారన్నారు. ఓ వైపు మాజీ ఎమ్మెల్యే ఎంవీ రమణారెడ్డి, మరో వైపు మల్లెల లింగారెడ్డి ఇలా ఎవరిని పడితే వారిని విమర్శించడం, అవసరమైతే మళ్లీ వాడుకోవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని తెలిపారు. చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన భూమిని వరద అల్లుడు రామచంద్రారెడ్డి అమ్ముకునేందుకు బేరం పెట్టిన విషయం అందరికీ తెలుసునన్నారు. డీఏడబ్ల్యూ కళాశాలకు చెందిన 10 ఎకరాల భూమిలో ఎలా నిర్మాణాలు చేపడుతున్నారని ప్రశ్నించారు. తనకు ఓటు వేయలేదని ప్రజలను సైతం డెకాయిట్ అని వరద అన్న వీడియోలు తన వద్ద ఉన్నాయన్నారు. ఐదు మార్లు ఎమ్మెల్యేగా గెలిచి, రెండు మార్లు ఓడిపోయినంత మాత్రాన ప్రజలను విమర్శిస్తే ఎలా అని ప్రశ్నించారు. ఇదే సీఎం సురేష్ నాయుడు కుటుంబాన్ని విమర్శించిన వరద మళ్లీ ఇప్పుడు కలసి పనిచేస్తున్నారన్నారు. ప్రజా వ్యతిరేకానికి రోల్ మోడల్ వరద అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. సమావేశంలో హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, తొగటవీరక్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, పోతిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, ఆటో నగర్ నన్నేసాహెబ్ పాల్గొన్నారు.

సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ హౌసింగ్ బోర్డు కాలనీలో నూతనంగా నిర్మించిన సచివాలయం –3ను శనివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.43.60 లక్షలతో సచివాలయాన్ని నిర్మించినట్లు తెలిపారు. సచివాలయం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు సత్వరమే అందుతాయని చెప్పారు. జగనన్న ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా సుపరిపాలన అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గద్ద మోషా, ఉప సర్పంచ్ కొండయ్య, మాజీ సర్పంచ్ దేవీప్రసాద్ రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు ఆసం దస్తగిరిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఓబయ్యయాదవ్, మార్కెట్ యార్డు మెంబర్ గోకుల మేరి, వార్డు మెంబర్ ఆదిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డి, మధు, వెంకటరెడ్డి, గజ్జల కళావతి, కొండా ధనలక్ష్మి, గుమ్మళ్ల పద్మ, పార్వతి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ సుధ

అట్లూరు : మండల పరిధిలోని కుంభగిరి పంచాయితీ లోని మల్లినేని పట్టణం కాలనీలో శనివారం పలు కటుంబాలు బద్వేలు ఎమ్మెల్యే డాక్టరు సుధా సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరాయి. మల్లినేని పట్టణం కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు ఇట్టా మునెయ్యతో పాటు పలు కుటుంబాలు జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండా మాధవరెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టరు రొండా మల్లికార్జున రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గంగయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే డాక్టర్ సుధా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభకు తరలిరండి

బద్వేలు అర్బన్ : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరగనున్న సిద్ధం బహిరంగ సభకు నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సిద్ధం సభ వాల్ పోస్టర్లు విడుదల చేశారు.

నియోజకవర్గ వ్యాప్తంగా 25 బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని, మరికొన్ని ప్రత్యేక వాహనాల్లో కార్యకర్తలు, నాయకులు సభ సమయానికి రాప్తాడుకు చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ కేశవరెడ్డి, అట్లూరు సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

చాపాడు: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం మధ్యాహ్నం నుంచి నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ సిద్ధం సభకు మైదుకూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్ణయించిన స్థలానికి ఉదయం 8గంటలకు చేరుకోవాలని, అక్కడి నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో రాప్తాడుకు బయలుదేరటం జరుగుతుందని తెలిపారు.

ప్రొద్దుటూరు : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగే సిద్ధం సభకు తరలి రావాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం 8 గంటలకు రాజన్న భోజన శాల వద్ద అల్పాహారం చేసిన అనంతరం వంద బస్సులతోపాటు సొంత వాహనాల్లో వెళ్లడం జరుగుతుందన్నారు.

ప్రతి పథకం రైతులకు అందాలి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ నాగరాజు

అట్లూరు: వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం రైతులకు అందేలా చర్యలు చేపట్టాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు పేర్కొన్నారు. శనివారం బద్వేలు వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో 2024 సంవత్సరానికి సంబంధించిన పంటల ప్రణాళిక, రబీ పంటల ఈ–పంట నమోదు, ఈకేవైసీ, విత్తన నమూనా, ఎరువుల నమోదు, ఉత్తమ యాజమాన్య పద్ధతులపై అట్లూరు, బద్వేలు, గోపవరం, సిద్దవటం మండలాల వ్యవసాయ అధికారులకు, రైతు భరోసా సహాయకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ పొలం బడి, రైతు భరోసా కేంద్రం ద్వారా ఎరువుల పంపిణీ నాణ్యత, ఈకేవైసీ రికార్డుల నిర్వహణ, రైతులకు డ్రిప్ పరికరాల ఉపయోగంపై అవగాహన తదితర అంశాలపై వివరించారు. అలాగే చిరుధాన్యాల సాగు విస్తరణపై రైతులకు వివరించాలన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ అధికారులు చంద్రమోహన్ రెడ్డి, రమేష్ రెడ్డి, రామకృష్ణయ్య, హబ్ వ్యవసాయ అధికారిణి బి. మాధురి, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

పెద్ద శేషవాహనంపై శ్రీవేంకటరమణుడు



పెద్ద శేషవాహనంపై శ్రీవేంకటరమణుడు



ఊంజల్ సేవలో స్వామివారు

పులివెందుల టౌన్ : పట్టణంలో వెలసిన వేంకటరమణుడి ఆలయంలో వైభవంగా నిర్వహిస్తున్న శ్రీపద్మావతి సమేత కల్యాణ వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి స్వామి వారు పెద్ద శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక వాహనంలో స్వామివారిని రకరకాల పూలతో అలంకరించి పట్టణం పురవీధులైన మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్, గంగిరెడ్డి ఆసుపత్రి రోడ్డు, ముత్యాల వారి వీధి, గాడిచర్ల వీధి, అమ్మవారిశాల వీధుల మీదుగా గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. తమ ఇంటి ముంగిటకు స్వామివారు రాగానే భక్తిశ్రద్ధలతో భక్తులు కాయ, కర్పూరం, నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఉదయం సుప్రభాత సేవ.. తోమాల సేవతోపాటు ధ్వజారోహణం చేపట్టారు. సాయంత్రం సహస్రనామార్చన, నివేదన, యాగశాల ప్రవేశం, పుణ్యాహక వాచనం, నిత్య హోమం, వాస్తు హోమంతోపాటు తదితర పూజలు నిర్వహించారు. ఉభయ దారులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్ర దీపాలంకరన ఊంజల్ సేవలు నిర్వహించి స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

వైఎస్ఆర్‌సీపీకి ఓటు వేయండి



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని చెబుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి రాచమల్లు రమాదేవి, మహిళా నేతలు

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఓ వైపు, ఆయన సతీమణి, 26వ వార్డు కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి మరో వైపు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఎంపీ అభ్యర్థిగా వైఎస్ అవినాష్ రెడ్డిని గెలిపించాలని వారు ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. వార్డు కౌన్సిలర్ ద్వార్శల భారతి, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం జరిగింది. జగనన్న పాలనలో గడపగడపకు సంక్షేమ పథకాలు అందాయని ప్రజలకు వారు వివరించారు. ఎవరి రెకమెండేషన్ లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ ఆయిల్ మిల్లు ఖాజా, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, రాచమల్లు రాఘవేంద్రారెడ్డి, సోములవారిపల్లె సర్పంచ్ ప్రశాంతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శులు పోరెడ్డి నరసింహారెడ్డి, లక్కిరెడ్డి పవన్ రెడ్డి, పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశ్వారెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్ రెడ్డి, ఏపీపీఎస్‌సీ మాజీ మెంబర్ నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జి ద్వార్శల గురునాథరెడ్డి, 3వ వార్డు ఇన్‌చార్జి కృష్ణార్జునరెడ్డి, కౌన్సిలర్లు జిలాన్, గరిశపాటి లక్ష్మీదేవి, సత్యం, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, వైస్ ఎంపీపీ ఆసం దస్తగిరిరెడ్డి, నాయకులు మనోహర్, ఎమ్మార్పీఎస్ సుధాకర్, గోసా మనోహర్, మార్తల కృష్ణారెడ్డి, నూరి, స్నూకర్ భాస్కర్, న్యాయవాది జీవీ సుబ్బయ్య, నరాల మల్లికార్జునరెడ్డి, గోనా ప్రభాకర్‌రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు పద్మవీరన్న, బీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు చౌడం రవిచంద్ర, ఉప్పర మురళి, తుపాకుల వెంకటరమణ, వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎన్జీఓ హోం నుంచి ర్యాలీ చేపట్టారు. శివాలయం సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ తాలూకా చైర్మన్ కేజే రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఐఆర్ 30 శాతం ప్రకటించాలని, పెండింగ్ డీఏలను చెల్లించాలని తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏపీ జేఏసీ కన్వీనర్ రామసుబ్బయ్య, ఉమెన్స్ వింగ్ ప్రెసిడెంట్ జయమ్మ, కన్వీనర్ సుజాత, పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు జయరామిరెడ్డి, దస్తగిరిరెడ్డి, కార్యదర్శి వెంకటయ్య, ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీవీ రవీంద్రుడు, ఏపీ ఎన్జీఓస్ అసోసియేట్ ప్రెసిడెంట్ సదాశివయ్య, మధు, వెంకటేశ్వర్లు, శివరామనుజం పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులలో మెరుగైన వసతులు



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నాయని పీఆర్ అండ్ ఆర్‌డీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. అన్ని తరగతి గదులు పరిశీలించారు. విద్యార్థుల విద్యాస్థాయిని గమనించారు.

మధ్యాహ్న భోజనం స్వయంగా తిని రుచి చూశారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను పాఠశాల పరిస్థితి గురించి విచారించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో తెచ్చిన మార్పులతో రాష్ట్రంలో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు పోటీ పడుతున్నాయన్నారు. నాడు–నేడు కింద పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. విద్యార్థులకు యూనిఫామ్, బూట్లు, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ బోర్డు, ఆంగ్ల మాధ్యమంలో బోధన ఇవన్నీ అందించడంతో సమూలంగా మార్పు వచ్చిందన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలని.. మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్ననే గెలిపించుకుందామన్నారు.

సచివాలయాల సందర్శన...

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సచివాలయ వ్యవస్థ గ్రామీణ ప్రాంతాల్లో సమూల మార్పు తెచ్చిందని నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన పోరుమామిళ్ల–2, 4 సచివాలయాలను సందర్శించారు. సచివాలయాల్లో అందుతున్న సేవల గురించి విచారించారు. సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో అన్ని రకాల సేవలు ప్రజలకు అందుతున్నాయన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన



సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ వంశీకృష్ణ, ఉపాధ్యాయులు

చాపాడు: మండల కేంద్రమైన చాపాడులోని గాయత్రి హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన సైన్స్ ప్రదర్శన పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను మండల విద్యాధికారి–2 వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అంశం కూడా సైన్స్‌తో ముడిపడి ఉంటుందని అర్థం చేసుకోవడం ద్వారా ఉన్నత స్థితికి ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన చంద్రయాన్–3, బ్లడ్ సర్క్యులేషన్, రెస్పిరేటరీ సిస్టమ్, రక్త పరీక్ష, హైడ్రాలిక్ బ్రిడ్జి ఇంకా పలు రకాలైన సైన్స్ ప్రయోగాలను పరిశీలించారు.

పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



బి.కోడూరు పీహెచ్‌సీలో వ్యాక్సిన్లను పరిశీలిస్తున్న డాక్టర్ ఉమామహేశ్వరకుమార్

బి.కోడూరు : మార్చి 3వ తేదీన జరగబోయే జాతీయ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్ తెలిపారు. శనివారం మండల కేంద్రమైన బి.కోడూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బద్వేలు డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయాలని, తద్వారా అంగవైకల్యం నుండి కాపాడుకోవచ్చని, ప్రపంచం నుండి ఈ వైరస్‌ను పారదోలవచ్చని తెలిపారు. ఐఎల్ఆర్, డీప్‌ఫ్రీజర్ సరిగా పనిచేస్తున్నాయా, వ్యాక్సిన్ క్యారియర్లు, ఐస్ ప్యాక్స్ సరిపడా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. బద్వేలు డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్ మాట్లాడుతూ ఆసుపత్రిలో కాన్పులు జరిగే విధంగా చూడాలని స్టాఫ్‌నర్సులకు సూచనలు చేశారు. అలాగే మరాటిపల్లెలో జరుగుతున్న ఇమ్యునైజేషన్ సెషన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ మునిరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కిరణ్, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, ఏఎన్ఎం కుమారి, హెల్త్ అసిస్టెంట్లు నాగేశ్వరరావు, రామతీర్థం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.